76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

Bakers Fun
• CAKES • COOKIES • PIZZAS • BURGERS • SWEETS
ఫోన్: 98859 00500

రాజధాని వార్తలు
RAJADHANI VARTALU

'రాజధాని వార్తలు' పత్రికలో ప్రకటన కొరకు సంప్రదించండి
వై.రాజశేఖర్
ఫోన్ : 98480 89624, 9440662699
మంగళగిరి, గుంటూరు, విజయవాడ

అమరావతి సంపుటి : 4 సంచిక : 37, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 17 - ఆదివారం 23 జూన్,2019
Amaravati Volume : 4 Issue : 37, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 17 - Sunday 23 June, 2019

వివరాలు 2లో...

డబ్బుల్లేని ఏటీఎంపై ఫైన్...

వివరాలు 3లో...

చంద్రయాన్-2లో రాకెట్ మహిళలు

వివరాలు 4లో...

ఇలాగైతే ప్రభుత్వ పాఠశాలలు మూతే..

వివరాలు 4లో...

గుంటూరులో "భార్యా భర్తల బ్రేకప్!"

ఆరంభం అదిరింది...

ఆకట్టుకున్న స్పీకర్ తమ్మినేని ప్రసంగం...

తెలుగు లో ఓ సామెత ఉంది "అన్నం ఉడికిందా లేదా అని చూడాలంటే అన్నం మొత్తం చూడాల్సిన అవసరం లేదు ...ఓ మెతుకు పట్టుకుని చూస్తే చాలు అని "అలాగే కొత్త అసెంబ్లీ లో ఎన్నికైన స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన తొలి ప్రసంగం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది.మరి ముఖ్యంగా **పార్టీ ఫిరాయంపులు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ నేపథ్యంలో ఫిరాయంపులనే లక్ష్యంగాచేసుకుని మాట్లాడటం ప్రజాస్వామ్యవాదులకు సంతోషాన్ని ఇచ్చింది**. అన్నింటినీ మించి ప్రజలు మనల్ని గమనిస్తున్నారన్న మాట శక్తి వంతమైనది. ఆరుసార్లు శాసనసభ కు ఎన్నికై, అధికార, ప్రతిపక్ష సభ్యుడిగా ఉండటం, మంత్రి గా పనిచేసిన అనుభవం వెరసి ఇప్పుడు స్పీకర్ గా పరిణితి చెందడానికి ఉపయోగపడింది. ఆ పరిణితి తొలి ప్రసంగంలో కొట్టొచ్చినట్లుగా కనపడింది.

న్యాయ, కార్యనిర్వహక,శాసనసభ, మీడియా వ్యవస్థలను ప్రస్తావించిన తమ్మినేని ఈ నాలుగు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ హితవచనం గంభీరమైన వాతావరణంలో వినపడటం విశేషం.

రోజుకు ఆరు లక్షల రూపాయలు అసెంబ్లీ నిర్వహించినందుకు ఖర్చు అవుతుందని కుండ బద్దలు కొట్టారు. ఈ డబ్బు ప్రజల నుంచి వచ్చిన డబ్బు కావడంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరడం ఆయన పరిపక్వత కు నిలువుటద్దం గా కనిపించింది.

మరో హర్షనీయమైన సంగతి ఏమంటే... అసెంబ్లీలో సభ్యులు వ్యవహరించాల్సిన తీరు పై త్వరలోనే శిక్షణా తరగతులను నిర్వహిస్తామని ప్రకటించి తన నిబద్ధత ను చాటారు. ఓ వైపు తన గత రాజకీయ జీవితంలో సభానాయకుడు, మరో వైపు ఇప్పటి డాషింగ్ సభానాయకుడు. వీరిరువురి సంవాదాల నడుమ సభాపతి గా వ్యవహరించడమంటే మాటలు కాదు. అయినా సరే ఈ సవాల్ ను వినమ్రంగా స్వీకరించిన తమ్మినేని సీతారాం ఉత్తమ స్పీకర్ గా చరిత్రలో నిలచిపోవాలని ఆశిద్దాం.

ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం

రాజధాని వార్తలు, డెస్క్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏపీ భవన్‌లో జరిగిన వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం కొద్దిసేపటి క్రితం ముగిసింది. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు, ప్రత్యేక హోదాపై ఉభయసభల్లో అవలంభించాల్సిన విధానంపై పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. 'పార్లమెంట్‌లో నాలుగవ అతి పెద్ద పార్టీగా వైఎస్సార్ సీపీ ఉంది. దీన్ని ఒక అవకాశంగా భావించాలి. మనకున్న సంఖ్యాబలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఫలితాలు రాబట్టాలి. ఆంధ్రప్రదేశ్ ఎంపీల గౌరవం పెరిగేలా, హుందాగా వ్యవహరిస్తూ సభా కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఎక్కువ శాతం యువకులు, విద్యావంతులు ఉండటం వల్ల భాషాపరమైన సమస్య ఉండదు. శాఖలవారీగా ఎంపీలు ఏర్పరచుకొని ఆయా శాఖాల నుంచి రావాల్సిన నిధులపై కృషి చేయాలి. వ్యక్తిగత ఆసక్తి, ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల అవసరాలు దృష్టిలో పెట్టుకుని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలను ఎంపిక చేసుకోవాలి. పార్లమెంట్ పార్టీ నేతగా విజయసాయి రెడ్డి, లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా మిథున్ రెడ్డి సలహాలు, సూచనలతో సభా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. ఎంపీలను సబ్ గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి, మంత్రిత్వ శాఖల వారీగా సబ్జెక్టులు కేటాయిస్తాం. తరచుగా ఆయా మంత్రిత్వ శాఖలకు సంబంధించి రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలను దృష్టి సారించాలి. క్రమశిక్షణ, ఐకమత్యంతో పార్లమెంట్‌లో వ్యవహరించాలి.' అని దిశానిర్దేశం చేశారు.

మీ వార్తలను, ప్రజా సమస్యలను పంపవలసిన వాట్సాప్ నెం : 9440662699

ఎస్ఆర్ఎం పరిశోధనలపై జులైలో సమీక్ష

- నీతి అయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ రాక
- ఢిల్లీలో డాక్టర్ సారస్వత్‌ను కలిసిన ప్రొ వీసీ నారాయణరావు

రాజధాని వార్తలు, అమరావతి : ప్రస్తుత విద్యాసం వత్సరంలో అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చేపట్టబోయే శాస్త్ర పరిశోధనలపై సమగ్రమైన సమీక్ష నిర్వహించేందుకు ప్రఖాత భారత శాస్త్రవేత్త, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్,నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ అంగీకరించారు. జులై రెండో వారంలో యూనివర్సిటీలో ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశానికి తాను హాజరవుతున్నట్లు తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీ వెళ్లిన యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. నారాయణరావు నీతి ఆయోగ్ కార్యాలయంలో వీకే సారస్వత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

ప్రస్తుతం అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రీసెర్చ్ అడ్వైయిజరీ కౌన్సిల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తోన్న డాక్టర్ సారస్వత్ ఏడాదికోసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరై విశ్వవిద్యాలయంలోనే పరిశోధన లకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జులై రెండో వారంలో అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలనీ, ఆ సమావేశానికి తాను రీసెర్చ్ కౌన్సిల్ ఛైర్మన్ హోదాలో హాజరవుతానని వెల్లడించారు. కాగా భారత ప్రధాని నరేంద్రమోడీ ద్వారా నీతి అయోగ్ సభ్యునిగా మరోసారి డాక్టర్ వీకే సారస్వత్ ఎంపిక కావడం వివేషమనీ, ఇది భారత శాస్త్రవేత్తలకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని ఎస్ఆర్ఎం ప్రొ వైస్ ఛాన్సలర్ నారాయణరావు పేర్కొన్నారు.

ఏపీ సీఆర్‌డీఏ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి

రాజధాని వార్తలు, మంగళగిరి : ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంతం డెవలప్మెంట్ అథారిటీ చట్టం, 2014 ప్రకారం విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ స్థానంలో 30 డిసెంబర్ 2014 న ఏపీ సీఆర్‌డీఏను ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రణాళిక, నిర్వహణ, పర్యవేక్షణ, ఫైనాన్సింగ్, నిధులు, వృద్ధి చేయడం, సురక్షితం కోసం, రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులపై ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, కొత్త రాజధానిని అభివృద్ధి, మేనేజింగ్,పట్టణ సేవలు పర్యవేక్షించే నిమిత్తం ఈ సంస్థ ఏర్పాటయ్యింది. కృష్ణా గుంటూరు జిల్లాల్లో 58 మండలాల పరిధిలో ఏపీ సీఆర్‌డీఏ ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఏపీ సీఆర్‌డీఏ ఛైర్మన్‌గా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

APCRDA

10 శాతం వైన్ షాపులు ఔట్...

రాజధాని వార్తలు, అమరావతి : 2024 నాటికి మద్య నిషేధాన్ని సంపూర్ణంగా అమల్లోకి తెస్తామన్న ఏపీ ప్రభుత్వం తొలి ప్రయత్నం మొదలుపెట్టింది. ఫలితంగా 10 శాతం లిక్కర్ షాపులు క్లోజయ్యే పరిస్థితి.ఏపీ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో మద్య నిషేధాన్ని దశల వారీగా అమలు చేస్తామనీ, మద్యాన్ని పూర్తిగా నిషేధించాకే (ఫైవ్ స్టార్ హోటళ్లలో తప్ప) 2024లో ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. అందులో భాగంగా తొలి దశ మొదలైంది. ఈనెల 30తో 2017-19కి మద్యం షాపులు, బార్‌ల లైసెన్సు ముగుస్తుంది.

తారెత్తిస్తున్న ఎండలు

- వృద్ధులు, పసిపిల్లలకు ప్రాణగండం
- చినుకు కోసం ఎదురు చూపు

న్యూఢిల్లీ : దేశంలో సుమారు మూడింట రెండు వంతుల ప్రాంతాలు ఎండలు వేడిమికి ఉడికిపోయాయి. మూడుదశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. వడగాడ్పులకు ప్రజలు మృత్యువాతపడుతున్నారు. కేరళ ఎక్స్‌ప్రెస్‌లోని నలుగురు ప్రయాణికులు యూపీలోని ఝాన్సీ వద్ద రైలులోనే వడదెబ్బకు గురై మరణించారు. దేశవ్యాప్తంగా కరవు ఛాయలు ఏర్పడ్డాయి. తాగు, సాగు నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఎండ వేడిమి తట్టుకోలేక వేల సంఖ్యలో ప్రజలు దేశంలోని ప్రసిద్ధ హిల్ స్టేషన్లకు క్యూ కట్టారు. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. ఉత్తర, మధ్య భారత ద్వీపకల్ప పెద్ద సమూహాలలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి. ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ, రాజస్థాన్‌లోని చురు, బికనేర్, హర్యానాలోని హిసార్, భివాని, పంజాబ్‌లోని పాటియాల,

- మిగతా 2 లో

ఏపీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన సమాచార కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ టీవీకె రెడ్డి

సోమవారం తన కార్యాలయంలో అడుగిడుతున్న డిప్యూటీ సీఎం, మైనార్టీ శాఖా మంత్రి అంజద్ బాషా

ఫలించిన వైసీపీ వ్యూహం

రాజధాని వార్తలు, అమరావతి : టీడీపీ తరపున గెలిచిన 23 మంది ఎమ్మెల్యేల్లో పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నవాళ్లు ఎవరనే దానిపై ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికర చర్చ సాగుతోంది. అడ్డదిడ్డంగా వైసీపీపై విమర్శలు చేస్తున్నవారిని నియంత్రించేందుకు వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మీ పార్టీలో వాళ్లు మాతో టచ్‌లో ఉన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తే మీకు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు, అని అసెంబ్లీలోనే హెచ్చరించిన నేపథ్యంలో టీడీపీ అధినాయకత్వం తమ ఎమ్మెల్యేలపై నిఘా ఉంచింది.



మరో 12 జిల్లాలకు ప్రతిపాదన



రాజధాని వార్తలు, అమరావతి : 'అధికారంలోకి వస్తే ప్రతి లోక్‌సభ నియోజకవర్గాన్ని జిల్లాగా మారుస్తాం' అని హామీ ఇచ్చిన జగన్... దానిని అమలులోకి తెచ్చే దిశగా చర్యలు మొదలుపెట్టారు. తమకు అందిన సంకేతాల మేరకు రెవెన్యూ శాఖ ఇప్పటికే దీనిపై కసరత్తు చేస్తోంది. లోక్‌సభ నియోజకవర్గాల ప్రకారం చూస్తే... ఇప్పుడున్న 13 జిల్లాలు 25 అవుతాయి. కొత్తగా ఓ గిరిజన జిల్లాను కూడా ఏర్పాటు చేస్తామని వైసీపీ హామీ ఇచ్చింది. దీనిని కూడా కలిపితే 26 జిల్లాలు అవుతాయి. ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఆయన ముందుంచనున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం... రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని 13 జిల్లాలతో నవ్యాంధ్ర ఏర్పడింది. మరో 8 జిల్లాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు అప్పుడే వచ్చాయి. అయితే... రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందులు, రాజధాని నిర్మాణ అవసరంతోపాటు అధికారుల కొరత కారణంగా దీనిపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. 2017లో మరోసారి కొత్త జిల్లాల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్‌లు, జిల్లాల ఏర్పాటుపై ఉభయ గోదావరి, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి పలు ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త జిల్లాల ఏర్పాటు ఆర్థికంగా భారమవుతుందని మళ్లీ దీనిని పక్కనపెట్టారు. మూడోసారి ఇదే అంశంపై టీడీపీ ప్రభుత్వం పాత నివేదికలను తెప్పించుకుంది. ఈలోగా ఎన్నికలు రావడంతో దానిని పక్కన పెట్టేశారు. అయితే, ఎన్నికలకు ముందు వైసీపీ మేనిఫెస్టోలో జిల్లాల ఏర్పాటుపై స్పష్టత ఇచ్చింది.

కొత్త జిల్లాలు ఇవే?

అరకు(విశాఖ జిల్లా), అనకాపల్లి(విశాఖ జిల్లా), అమలాపురం (తూర్పు గోదావరి), రాజమండ్రి(తూర్పు గోదావరి), నరసాపురం(పశ్చిమగోదావరి), విజయవాడ(కృష్ణా జిల్లా), నర్సరావుపేట(గుంటూరు జిల్లా), బాపట్ల(గుంటూరు జిల్లా), నంద్యాల(కర్నూలు జిల్లా), హిందూపురం(అనంతపురం జిల్లా), తిరుపతి(చిత్తూరు జిల్లా), రాజంపేట(కడప జిల్లా)

గిరిజన జిల్లా ఎక్కడ?

ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు ఎలా అన్నదానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. విశాఖ నుంచి విడదీసే అరకునే గిరిజన జిల్లాగా ప్రకటించాలా? లేక శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల మధ్య ఉన్న ఏజెన్సీ ప్రాంతంతో పార్వతీపురం కేంద్రంగా జిల్లాగా ప్రకటించాలా

ఇప్పటికే 13.. సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

అన్నదానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. గిరిజన జిల్లా కేంద్రం ప్రజలకు మరీ దూరంగా ఉండకూడదని, వారికి అన్ని సేవలు సులువుగా లభించేలా చూడాలని అధికారవర్గాలు చెబుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వైసీపీకి ప్రజలు అఖండ విజయం కట్టబెట్టారు. మన్యంలో వైసీపీ హవా కొనసాగింది. ఈ నేపథ్యంలో గిరిజన జిల్లా ఏర్పాటుపై పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు. విశాఖ మన్యంలో అరకును జిల్లా చేసి... శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని ఏజెన్సీలోనే కొత్తజిల్లా ఉండటం ఖాయమని చెబుతున్నారు.

పునర్‌వ్యవస్థీకరణ ఎలా?

జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు ప్రత్యేక చట్టం ఉంది. దీని ప్రకారం మండలాలు, రెవెన్యూ డివిజన్‌లను పునర్‌వ్యవస్థీకరించాలి. గ్రామీణ, నగర మండలాలను కూడా విభజించాలి. మొత్తంగా 8 కొత్త డివిజన్లు, 20కి పైగా మండలాలు వచ్చే అవకాశముంది. ఈ మేరకు అధికారులు గత ఏడాది చివరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పునర్‌విభజన పూర్తయ్యాక... జిల్లాలను భౌగోళిక పద్ధతిలో ఏర్పాటు చేయాలా, లోక్‌సభ పరిధి మేరకు విభజన చేపట్టాలా అన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇంతకు ముందు మాత్రం అధికారులు భౌగోళిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇప్పుడు వైసీపీ ఎన్నికల హామీ మేరకు లోక్‌సభ స్థానాల కేంద్రంగా కొత్త జిల్లాల ఏర్పాటు జరిగేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఏ జిల్లా ఎలా...

- చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాలు విస్తీర్ణంలో చాలా పెద్దవి. వీటిని విభజించాలని ముందునుంచే ప్రతిపాదనలున్నాయి.
- లోక్‌సభ నియోజకవర్గాల ప్రకారం చూస్తే... కాకినాడ జిల్లా కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరిలో కొత్తగా అమలాపురం, రాజమండ్రి జిల్లాలు ఏర్పాటవుతాయి. కాకినాడ కేంద్రంగా 'తూర్పు గోదావరి' జిల్లా పేరును కొనసాగించే అవకాశం ఉంది.
- పశ్చిమ గోదావరి జిల్లా పరిపాలన కేంద్రం ఏలూరు. ఈ జిల్లా నుంచి కొత్తగా నర్సాపురాన్ని వేరుచేసి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయనున్నారు.
- కృష్ణా జిల్లాకు పరిపాలనా కేంద్రం మచిలీపట్నం. విజయవాడ మరో లోక్‌సభ స్థానం. పాలనా కేంద్రం మచిలీపట్నమే అయినా అధికారుల సేవలన్నీ విజయవాడ కేంద్రంగానే కొనసాగుతున్నాయి. ఇప్పుడు రెండు వేర్వేరు జిల్లాలు ఏర్పాటవుతాయి.
- గుంటూరు జిల్లాను విభజించి కొత్తగా మరో రెండు జిల్లాలను ఏర్పాటు చేస్తారు. అందులో ఒకటి నర్సారావుపేట. రెండోది బాపట్ల. బాపట్ల విషయంలో పాలనా కేంద్రం ఎక్కడ అన్నదానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. బాపట్ల నియోజకవర్గం పరిధిలోని మండలాలకు పాలనా కేంద్రానికి మధ్య ప్రయాణదూరం చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో దీనిపై రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.
- కర్నూలు జిల్లా నుంచి నంద్యాల, అనంతపురం నుంచి హిందూపురంను విభజించి కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారు.
- కడపలో రాజంపేట ప్రాంతానిది ప్రత్యేకత ఉంది. దీనికి చిత్తూరులోని కొన్ని ప్రాంతాలను కలిపి కొత్త జిల్లా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.
- చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిని కొత్త జిల్లాగా మారుస్తారు. రేణిగుంట, శ్రీకాళహస్తితోపాటు అనేక ప్రాంతాలు ఈ జిల్లా పరిధిలోకి వస్తాయి.

రారెత్తిస్తున్న ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్‌లోని భోపాల్, గ్వాలియర్‌లలో ఇంతే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సైతం మండిపోతోంది గత వారం 48 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు కాగా, పాలం వద్ద 45.4 డిగ్రీలు నమోదయ్యింది. గుజరాత్ వైపు దూసుకొస్తున్న తీవ్ర తుపాను 'వాయు' కారణంగా రుతుపవనాల విస్తరణకు కొంత అడ్డంకి ఏర్పడిందని, వర్షాలు పడటానికి కొంత సమయం వేచి ఉండక తప్పదని నిపుణులు పేర్కొంటున్నారు. 32 రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతల క్రమం కొనసాగుతోంది. వచ్చే రెండు రోజుల్లో మెర్కురీ స్థాయి తగ్గనట్లయితే, జూన్‌లో మూడు వారాలకు చరిత్రలోనే 2019 అత్యధిక ఉష్ణోగ్రతల క్రమం కొనసాగిన సంవత్సరంగా రికార్డు నమోదు చేసుకుంటుంది.

1988లో 33 రోజులపాటు ఇదే స్థాయిలో వడగాడ్పులు కొనసాగగా, 2016లో 32 రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత మైదాన ప్రాంతాల్లో కనీసం 40 డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు వేడిగాలులుగా నిర్వచించబడుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. ప్రారంభం నుంచే 45 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతున్న ఝాన్సీ వద్ద వేడి గాలులకు తట్టుకోలేక కేరళ ఎక్స్‌ప్రెస్‌లో నలుగురు వృద్ధ ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. ఆగ్రాను సందర్శించుకున్న తర్వాత తమిళనాడులోని కోయంబత్తూరుకు తిరిగి ప్రయాణమైన 67 మందితో కూడిన గ్రూపులోని ఈ నలుగురు ప్రయాణికులు మరణించారు. వీరంతా నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. ఝాన్సీ వద్ద రైలులో వీరిని వైద్యులు పరీక్షించగా ముగ్గురు అప్పటికే మరణించగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు. వడగాడ్పులకే వీరు మరణించినట్లు ప్రాథమిక అంచనా వేసినప్పటికీ, పోస్టుమార్టమ్ నివేదిక వచ్చిన తర్వాతే కచ్చితమైన కారణం తెలుస్తుందన్నారు.

ఐఎండీ డేటా ఆధారంగా ఉష్ణ తరంగాలకు సంబంధించి అనేక శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం వడగాడ్పులు మరింత పెరుగుతున్నాయని వెల్లడయ్యింది. పూణేకు చెందిన శాస్త్రవేత్త డి.ఎస్.పాయ్ మాట్లాడుతూ 35 మెట్రోలాజికల్ సబ్ డివిజన్‌ల దీర్ఘకాల ఉష్ణ తరంగ వివరాలకు తాము అధ్యయం చేయగా 1991 నాటి నుంచి ఏటా వడగాడ్పులు పెరుగుతూనే ఉన్నట్లు వెల్లడైందని తెలిపారు. రెండు దశాబ్దాల్లో ఈ పెరుగుదల నిలకడగా ఉన్నట్లు పరిశీలనలో స్పష్టమైందని పేర్కొన్నారు. పగి పూట, రాత్రి వేళల్లో వేడిగాలులు అత్యధిక రోజులు కొనసాగుతాయని పూణేలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోఫికల్ మెటారలజీ (ఐఐటీఎం) పేర్కొంది. 1970-2015 మధ్య దేశవ్యాప్తంగా రోజువారీ కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలను విశేష్టించగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో భారీ తేడా స్పష్టమైందన్నారు. చల్లగా ఉండే పగలు, రాత్రుళ్ల సంఖ్య క్రమంగా క్షీణించినట్లు వివరించారు. వాతావరణ మార్పుతో భారత్‌లో వేడి గాలుల తీవ్రత పెరుగుతుంది అని ఐఐటీఎం సీనియర్ శాస్త్రవేత్త ఎస్.కృష్ణన్ తెలిపారు. ఈ వారాంతంలో వాతావరణం చల్లబడవచ్చని ఐఎండీ తెలిపింది.

విద్యుత్‌కు పెరిగిన డిమాండు.. తీవ్ర నీటి కొరత

అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉత్తర భారతంలోని ప్రధాని నగరాలలో విద్యుత్‌కు డిమాండు పెరిగింది. అలాగే అనేక నదులు, జలాశయాలు ఎండిపోయాయి. దీంతోసాగు, తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడింది. దేశ రాజధాని ఢిల్లీలో విద్యుత్ డిమాండు రికార్డు స్థాయిలో 6,686 మెగావాట్లకు చేరినట్లు డిస్కమ్‌లు తెలిపాయి. నీటి కొరత సంగతి చెప్పనవసరమేలేదు. పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఉత్తర ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే, ఇక్కడి అనేక గ్రామాల ప్రజలు భూగర్భ జలాలపై ఆధారపడి ఉన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో వారు తాగునీటి కోసం కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో చేతిపంపులు పని చేసే పరిస్థితి లేదు. 300 అడుగుల లోతుకు భూగర్భ జలాలు పడియాయి.

కనిపించని తొలకరి జాడ

రాజధాని వార్తలు, అమరావతి: జూన్ సగానికొచ్చినా కోస్తాలో చినుకు సందడి లేదు.. తొలకరి జాడ కనిపించడం లేదు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా ఉన్న తొమ్మిది జిల్లాల్లో ఆరుచోట్ల దుర్భిక్ష పరిస్థితులు కన్పిస్తున్నాయి. 68 నుంచి 93.7 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఏటా ఈ సమయానికి దుక్కులు దున్నించి విత్తనం వేయడానికి పొలాల్ని సిద్ధం చేసేవారు. ఇప్పుడు చాలా చోట్ల ఆ పరిస్థితి కనిపించడం లేదు. జూన్ 1 నుంచి 12 వరకు పరిశీలిస్తే.. కోస్తాలోని 9 జిల్లాల్లో 57శాతం లోటు వర్షపాతం నమోదైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ ఇప్పటికీ ఎండలు మండుతున్నాయి. ఎక్కడా..విత్తనం వేసే వాతావరణం కానరావడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సాధారణ వర్షపాతంలో 20శాతం కూడా పడలేదు.

దిక్కుతోచని స్థితిలో

గతేడాది పత్తి, మిరప సాగుచేసి సకాలంలో వర్షాలు పడక, తెగుళ్ల వ్యాప్తితో తీవ్రంగా నష్టపోయిన దక్షిణ కోస్తా రైతాంగం..ఈ ఏడాది ఎటు సాగాలా? అని దిక్కుతోచని పరిస్థితుల్లో సతమతమవుతోంది. కృష్ణా జిల్లా పశ్చిమ ప్రాంతంతోపాటు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మెట్ట పొలాల కౌలు ధరలు సగానికి సగం పడిపోయాయి. ఎంతోకొంత ఇచ్చి పంట వేసుకోండి అనే పరిస్థితి కనిపిస్తోంది.

ఏపీకి ఊరట

రాజధాని వార్తాలు, అమరావతి : రాజధాని కూడా లేని రాష్ట్రం.. మొన్నటివరకు చంద్రబాబు కేంద్రంతో ఢీ అంటే ఢీ అనడంతో రూపాయి విదిల్చ లేదు కేంద్రంలోని బీజేపీ సర్కారు. కానీ వైఎస్ జగన్ వచ్చాక ఏపీ పరిస్థితి మారుతోంది. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఏపీకి రావాల్సిన నిధులను వడివడిగా విడుదల చేస్తోంది. పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తోంది.జగన్ సీఎం అవ్వగానే కేంద్రంలో అధికారం చేపట్టిన మోడీని మర్యాదపూర్వకంగా కలువడం.. ఏపీకి సాయాన్ని అర్థం అర్థించాడు. చంద్రబాబు అంటే పడని మోడీ ఇప్పుడు జగన్ తో దోస్తీ చేస్తున్నాడు. ఆ కోవలోనే నిధులు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే పోలవరానికి సంబంధించి నిధులను 3వేల కోట్లను విడుదల చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ మేరకు నిధులను నాబర్డ్ నుంచి రిలీజ్ చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు కేంద్ర జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపింది.ఇప్పుడు తాజాగా ఏపీలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి రావాల్సిన పెండింగ్ నిధులను కేంద్రం విడుదల చేసింది. ఏపీకి రావాల్సిన మొత్తం నిధుల్లో ప్రస్తుతం రూ.708 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 2500 కోట్లకు రూ.708 కోట్లు విడుదల చేసింది.టీడీపీ ఏపీలో అధికారం ఉన్నప్పుడు చంద్రబాబు కయ్యానికి కాలుదువ్వడంతో ఏపీకి రావాల్సిన నిధులన్నింటిని పెండింగ్ లో పెట్టిన కేంద్రం ఇప్పుడు వైసీపీ అధికారంలోకి రావడంతో విడుదల చేస్తోంది.

అమ్మకానికి హైదరాబాద్ వజ్రాల హారం

మహారాజులు, మొఘల్ పాలకులు వినియోగించిన దాదాపు 400 నగలను క్రిస్టీ సంస్థ ఈ నెల 19న వేలం వేయనుంది. ఈ నేపథ్యంలో వాటిలో కొన్నింటిని న్యూయార్క్‌లో ప్రదర్శనకు ఉంచారు. చిత్రంలో కనిపిస్తున్న హారాల్లో మధ్యలో ఉన్న వజ్రాల హారం హైదరాబాద్‌కు చెందినదే. 1890ల నాటి ఆ ఆభరణం వేలంలో దాదాపు రూ.8.4 కోట్ల నుంచి రూ.10.5 కోట్ల వరకు పలుకుతుందని అంచనా.

వైసీపీ ఎమ్మెల్యే గెలుపుపై కోర్టుకెక్కిన టీడీపీ నేత

రాజధాని వార్తాలు - అమరావతి : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మల్లాది విష్ణు గెలుపు ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఆయన ప్రత్యర్థి బొండా ఉమ హైకోర్టును ఆశ్రయించారు.తన ప్రత్యర్థి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించిన మల్లాది విష్ణుపై టీడీపీ నేత బొండా ఉమా హైకోర్టును ఆశ్రయించారు. తనపై 25 ఓట్లతో వైకాపా అభ్యర్థి మల్లాది విష్ణు గెలుపొందినట్లు అధికారులు మే 23న జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన తన రిట్ పిటిషన్‌లో కోరారు. తమ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో వీవీప్యాట్స్‌ను లెక్కించాకే ఫలితాల్ని ప్రకటించాలని కోరినా రిటర్నింగ్ అధికారి పట్టించుకోలేదని బొండా ఉమ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పలు వ్యత్యాసాల్ని తాను గమనించానన్నారు.

ఈ వ్యవహారమై అదే రోజు జిల్లా ఎన్నికల అధికారి వినతి సమర్పిస్తూ ఫలితాల ప్రకటనకు ముందే వీవీప్యాట్స్ లెక్కింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకొని తాను ఇచ్చిన వినతిపై ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల మేరకు వ్యవహరించేలా ఎన్నికల అధికారిని ఆదేశించాలని ఉమా కోరారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... కేసు తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. 2014లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు... గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సెంట్రల్ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాది విష్ణుతో పోటీపడి 25 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఓటమిని చవిచూశారు. ఇద్దరి మధ్య చివరివరకు దోబూచులాడిన విజయం... చివరకు మల్లాది విష్ణును వరించింది. అయితే వీవీప్యాట్స్ లెక్కింపు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ బొండా ఉమా కోర్టును ఆశ్రయించారు.

డబ్బుల్లేని ఏటీఎంపై ఫైన్...

ఆర్బీఐ కొత్త నిర్ణయం

న్యూఢిల్లీ : డబ్బు ఉండే ఏటీఎంల కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిన పని తప్పేలా రిజర్వ్‌బ్యాంక్ తీసుకున్న నిర్ణయం బ్యాంకుల కస్టమర్లకు మేలు చేయబోతోంది.బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు చెల్లించేటప్పుడు ఒక్క రోజు ఆలస్యమైనా బ్యాంకులు ఊరుకుంటాయా... వడ్డీ వడ్డించేస్తాయి. మరి అలాంటప్పుడు మనకు ఇవ్వాల్సిన సర్వీసులు కూడా అదే విధంగా ఇవ్వాలి కదా. ఉదాహరణకు ఏటీఎంలకు వెళ్లినప్పుడు అవి పని చెయ్యట్లేదనో, డబ్బులు లేవనో వాటి ముందు బోర్డులు వేలాడదీస్తుంటారు. ఫలితంగా ఇబ్బంది పడుతున్నది మనమే కదా. దీనిపై బ్యాంకులు ఎందుకు సమాధానం చెప్పవన్నది తేలాల్సిన ప్రశ్న. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టాలని రిజర్వ్ బ్యాంక్ డిసైడైంది. ఇకపై ఏటీఎంల ముందు గంటల తరబడి నో క్యాష్ బోర్డ్ వేలాడదీస్తే కుదరదు. 3 గంటలకు మించి ఆ బోర్డ్ ఉంటే, ఆ ఏటీఎం కేంద్రంపై ఆర్బీఐ చర్యలు తీసుకుంటుంది. జరిమానా వేసి... బ్యాంకుకి పంపిస్తుంది. ఈ ఫైన్ అన్ని ఏటీఎంలకూ ఒకే విధంగా ఉండదు. ఏటీఎం ఉన్న ప్రదేశం, దానికి ఉన్న డిమాండ్, వచ్చే కస్టమర్లు అన్నింటినీ లెక్కలోకి తీసుకొని ఫైన్ వేసి... ఆ నోటీస్‌ను బ్యాంక్ శాఖకు పంపిస్తుంది ఆర్బీఐ. దేశంలో రోజూ కొన్ని లక్షల ఏటీఎంలు ఇలాగే పనిచెయ్యకుండా, డబ్బులు లేకుండా ఉన్నాయి. వాటి వల్ల కొన్ని కోట్ల మంది ఇబ్బంది పడుతున్నారు. కొంతమందైతే ఏటీఎంలలో డబ్బుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. ఆర్బీఐ నిర్ణయం మనకు కలిసొచ్చే అంశమే. ఇలాంటి ఫైన్లు వేస్తేనే బ్యాంకులు జాగ్రత్త పడి... ఏటీఎంలలో ఎప్పటికప్పుడు క్యాష్ ఫిలప్ చేస్తాయని భావించవచ్చు.

జాతీయ విద్యా విధానాన్ని స్వాగతించిన ప్రొఫెసర్

SRM UNIVERSITY — AP, Amaravati

రాజధాని వార్తలు, అమరావతి : ఇటీవల 'రాజధాని వార్తలు' పత్రికలో జూన్ 9న ప్రచురించిన వ్యాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలని నూతనంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రొ.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డా.నారాయణరావు కోరిన విషయం తెలిసిందే. అంతేకాకుండా 2030 సంవత్సరం నాటికి విద్యాపరంగా దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కూడా ఆకాక్షించారు. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యాపాలసీలో 2030 సంవత్సరం నాటికి దేశంలో 100 పరిశోధనాత్మక విశ్వవిద్యాలయాలు, 500 ఉన్నత ప్రమాణాలతో కూడిన విశ్వవిద్యాలయాలు స్థాపించాలని (మిషన్ నలందా) నిర్ణయించారు. దీంతో మన రాష్ట్రానికి దాదాపు 15 నుండి 20 యూనివర్శిటీలు వచ్చే అవకాశం ఉందని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రొ.వైస్ ఛాన్సలర్ డా.నారాయణరావు తెలిపారు. ఆయన అనుకున్నట్లుగానే జాతీయ విద్యావిధానంలో కూడా 2030 నాటికి అనేక పరిశోధనాత్మక యూనివర్సిటీలు, విద్యాసంస్థల కొరకు ప్రణాళికలు రచించడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీంతో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని, యువతకు మరెన్నో అవకాశాలు, ఉపాధి లభిస్తుందన్నారు.

హైదరాబాద్‌కు ఆ అదృష్టం లేదా ?

హైదరాబాద్ : కర్ణాటక రాజధాని బెంగళూరు మెట్రో స్టేషన్లలో సినీసందడి నెలకొంది. సినిమా షూటింగ్లకు అనుకూలంగా లొకేషన్లు ఉండటంతో కన్నడ - తమిళ - తెలుగు - హిందీ - మలయాళీ భాషల చిత్రాలతో పాటు డాక్యుమెంటరీలు - అడ్వర్టయిజ్మెంట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ మేరకు బెంగళూరు మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ కూడా నగదు రూపేణా ఒప్పందం చేసుకుంది. గత 2013లోనే సినిమా షూటింగ్లకు అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సినిమా షూటింగ్ ల నుంచి బీఎంఆర్సీఎల్ కు సుమారు రూ.25 లక్షల ఆదాయం వచ్చినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. మెట్రో స్టేషన్ లోని అందాలు - రైళ్లలో ప్రయాణిస్తూ చిత్రీకరణ చేస్తున్నారు. 2014 - 2015లో 4 సినిమాలు - 2016లో 3 - 2017లో ఆరు - 2018లో నాలుగు సినిమాలను మెట్రో స్టేషన్లు - రైళ్లలో చిత్రీకరించారు. అదేవిధంగా దేశ - విదేశాలకు చెందిన ప్రముఖ ప్రైవేటు ప్రకటనల కంపెనీలు కూడా షూటింగ్ లు చేశాయి.

మెట్రోస్టేషన్లు - రైళ్లలో సినిమా షూటింగ్ లకు కన్నడ సినీ ప్రముఖులే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి లొకేషన్లు - రియాలిటీ దృశ్యాలు చిత్రీకరణకు అనుకూలంగా ఉండటంతో విదేశీ సినిమాలు కూడా తీస్తున్నారు. ఈక్రమంలో బీఎంఆర్సీఎల్ కొన్ని షరతులు విధించింది. స్వదేశీయులు అయితే 15 రోజులు ముందుగా.. విదేశీయులు అయితే 30 రోజులు ముందుగా అనుమతి తీసుకోవాలి.

అంతేకాకుండా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చిత్రీకరణ చేసుకోవాల్సి ఉంది. మెట్రో సదుపాయాల నిమిత్తం ముందుగానే రూ.2.5కోట్లు బీమా చెల్లించాల్సి ఉంటుంది. మెట్రోలో షూటింగ్ అనుమతి కోసం గంటకు రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. రూ.6 లక్షలు దాటితే జీఎస్టీ కూడా అదనంగా చెల్లించాలి. కాగా షూటింగ్ సమయంలో రైలును వినియోగిస్తే అదనంగా గంటకు మరో రూ.20 వేలు చెల్లించాలి. కన్నడ చిత్రాలకు 25 శాతం రాయితీ ఉంటుంది. బెంగళూరు మెట్రో చేస్తున్న ఈ లాభసాటి వ్యవహారం నుంచి హైదరాబాద్ మెట్రో కూడా నేర్చుకోవాల్సింది ఉందేమో!

వాలంటీర్ల పోస్టులకు సిద్ధంకండి

- ఉత్తీర్ణులయ్యే శిక్షణ ఇస్తాం
- క్యాకర్తల ఎంపిక బాధ్యత పార్టీదే
- వైకాపా బూత్ కమిటీ ఇన్‌ఛార్జులతో విజయపాయిరెడ్డి



రాజధాని వార్తలు,అమరావతి : గ్రామ వాలంటీర్ల పోస్టులకు పార్టీ కార్యకర్తలు దరఖాస్తు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత బూత్ కమిటీల ఇన్ ఛార్జులదేనని వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వారికెలా న్యాయం చేయాలనేది సీఎం ముఖ్య సలహాదారుతో పాటు పార్టీ చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. గ్రామ వాలంటీర్లకు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, అర్హులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో లోక్‌సభ, శాసనసభ, మండల బూత్ కమిటీ ఇన్‌ఛార్జులతో వైకాపా బూత్ కమిటీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామ వలంటీర్ల ఎంపిక ప్రక్రియ తీరుపై సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, విజయసాయిరెడ్డి కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ 'పార్టీ విజయంలో కార్యకర్తల కృషి ఎంతో ఉంది. మీ సేవలను పార్టీ ఎన్నటికీ మరవదు. పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో ఏర్పాటు చేసుకున్నాక ప్రతి శని ఆదివారాలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. గ్రామ వలంటీర్లపార్టీకి, ప్రజలకు మేలు చేస్తున్నామనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 2019లో పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నాం అవినీతిరహిత పాలనతో 2024లోనూ అధికారం నిలబెట్టుకోవటానికి అందరూ పట్టుదలగా పనిచేయాలి' అని చెప్పారు.

**2.88 లక్షల మం

చంద్రయాన్-2లో రాకెట్ మహిళలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరోసారి చంద్రుడి మీదకు ఉపగ్రహాన్ని పంపించబోతోంది.ఈ శాటిలైట్‌ను జులై 15 తెల్లవారుజామున 2 గంటల 51 నిమిషాలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తారు.ఇస్రో ఇంతకు ముందు 2008 అక్టోబర్‌లో చంద్రయాన్-1 ఉపగ్రహం చంద్రుడిపైకి పంపించింది. ఇప్పుడు చంద్రయాన్-2 మిషన్‌కు ఒక ప్రత్యేకత కూడా ఉంది. ఇది మహిళల నేతృత్వంలో జరుగుతున్న మొట్టమొదటి గ్రహాంతర మిషన్‌గా నిలిచింది.రీతూ కరిధల్ దీనికి మిషన్ డైరెక్టర్‌గా, ఎం.వనిత ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు.

చంద్రయాన్-2 గురించి ఒక మీడియా సమావేశంలో మాట్లాడిన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె.శివన్ "మాకు మహిళలు, పురుషులు అనే తేడా లేదు. ఇస్రోలో సుమారు 30 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు" అన్నారు.ఇస్రోలో ఒక పెద్ద మిషన్‌లో మహిళలు కీలకం కావడం ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు మార్స్ మిషన్‌లో కూడా 8 మంది మహిళలు కీలక పాత్ర పోషించారు. ఈసారీ చంద్రయాన్-2 మిషన్‌కు నేతృత్వం వహిస్తున్న రీతూ కరిధల్, ఎం.వనిత గురించి తెలుసుకుందాం.

రీతూ-రాకెట్ వుమెన్ ఆఫ్ ఇండియా

చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్ రీతూ కరిధల్‌ను 'రాకెట్ వుమెన్ ఆఫ్ ఇండియా' అని పిలుస్తారు. మార్స్ ఆర్బిటర్ మిషన్‌లో ఆమె డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.ఏరోస్పేస్ ఇంజనీరింగ్ డిగ్రీ చేసిన కరిధల్, లక్నో విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ చేశారు.రీతూ 2007లో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ నుంచి 'ఇస్రో యంగ్ సైంటిస్ట్' అవార్డ్ కూడా అందుకున్నారు.రీతూ కరిధల్‌కు చిన్నతనం నుంచీ సైన్స్ అంటే ఆసక్తి ఉండేది."నేను చంద్రుడి ఆకారం తగ్గడం, పెరగడం చూసి కంగారు పడేదాన్ని. అంతరిక్షంలో చీకట్లు దాటి అవతల ఉన్న విశ్వం గురించి తెలుసుకోవాలని అనుకునేదాన్ని" అని చెప్పారు.రీతూకు నచ్చిన సబ్జెక్ట్ ఫిజిక్స్, మ్యాథ్స్. ఆమె నాసా, ఇస్రో ప్రాజెక్టుల గురించి వార్తాపత్రిక కటింగ్స్ సేకరించేవారు. స్పేస్ సైన్స్‌కు సంబంధించిన ప్రతి చిన్న విషయం గురించీ తెలుసుకోవాలని ప్రయత్నించేవారు.సైన్స్, అంతరిక్షం అంటే ఉన్న ఆసక్తే రీతూను ఇస్రో వరకూ తీసుకొచ్చింది. "పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక నేను ఇస్రోలో ఉద్యోగం కోసం అప్లై చేశాను, స్పేస్ సైంటిస్ట్ అయ్యాను" అని ఆమె చెప్పారు.

ఆమె దాదాపు 20-21 ఏళ్లలో ఇస్రోలో చాలా ప్రాజెక్టులపై పనిచేశారు. వీటిలో 'మార్స్ ఆర్బిటర్ మిషన్' చాలా ముఖ్యమైనది. కుటుంబ సభ్యుల సహకారం లేకుండా ఎవరూ తమ లక్ష్యాన్ని సాధించలేరని రీతూ కరిఫుల్ చెబుతారు.ఆమెకు

ఆమె

ఒక బాబు, ఒక పాప. తల్లి అయిన తర్వాత ఇంట్లో ఉంటూ కూడా ఆఫీస్ పని చేసేదాన్ని, అప్పుడు పిల్లల్ని చూసుకోవడంలో తన భర్త సాయం చేసేవారని రీతూ చెప్పారు. "కుటుంబ సభ్యులు మీ ఆసక్తి, కష్టం చూసినప్పుడు వారికి కూడా మీకు అండగా నిలవాలని అనిపిస్తుంది" అన్నారు."నా కొడుకు 11 ఏళ్లు, పాపకు ఐదేళ్ల వయసులో మేం సమయం ఆదా చేయడానికి మల్టీ టాస్కింగ్ చేసేవాళ్లం. ఆఫీస్‌లో బాగా అలసిపోయినా, ఇంటికి వచ్చి పిల్లలను చూడగానే నా అలసట అంతా పోయేది అన్నారు.

"పురుషులు అంగారక గ్రహం నుంచి వస్తారని, మహిళలు శుక్రుడి నుంచి వస్తారని చెబుతారు. కానీ మార్స్ మిషన్ విజయవంతం అయ్యాక చాలా మంది మహిళా శాస్త్రవేత్తలను 'మార్స్ మహిళలు' అనడం మొదలుపెట్టారు. నేను భూమిపై అద్భుత అవకాశం అందుకున్న ఒక భారత మహిళను" అన్నారు.స్టార్ ప్లస్‌లో టెడ్ టాక్ అనే ఒక కార్యక్రమంలో మాట్లాడిన రీతూ కరిధల్ "నాకు మా అమ్మనాన్నలు 20 ఏళ్ల క్రితం ఇచ్చిన ఆత్మవిశ్వాసం ఈరోజు తల్లిదండ్రులు తమ ఆడ పిల్లల్లో చూస్తున్నారు. కానీ అమ్మాయిలు నగరాల్లో ఉన్నా, పట్టణాల వారైనా తల్లిదండ్రులు వారికి సరైన సహకారం అందిస్తేనే వారు చాలా ముందుకు వెళ్లగలరు" అని చెప్పారు.

చంద్రయాన్-2 అంటే..

చంద్రయాన్-2 చాలా ప్రత్యేకమైన ఉపగ్రహం. ఇందులో ఒక ఆర్బిటర్, 'విక్రమ్' అనే లాండర్, 'ప్రజ్ఞాన్' అనే రోవర్ ఉంటాయి. దీని ద్వారా భారత్ చంద్రుడి ఉపరితలంపై మొదటిసారి 'సాఫ్ట్ ల్యాండింగ్' చేయబోతోంది. ఇది చాలా క్లిష్టమైనది.ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.600 కోట్ల పైనే అని చెబుతున్నారు. 3.8 టన్నుల చంద్రయాన్-2ను జీఎస్ఎల్వీ మార్క్-3 ద్వారా అంతరిక్షంలోకి పంపించబోతున్నారు.భారత్ తన ఉపగ్రహం ముద్రను చంద్రుడిపై వేయడానికి ఇది చాలా కీలకమైన మిషన్. ఈ మిషన్ కచ్చితంగా విజయవంతం అవుతుందని ఇస్రో చెబుతోంది.ఇంతకు ముందు జరిగిన చంద్రయాన్-1 మిషన్ రెండేళ్లు జరగాలి. కానీ అందులో లోపాలు తలెత్తడంతో అది ఏడాదిలోనే ముగిసింది. దాని నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నామని, చంద్రయాన్-2లో ఆ లోపాలు సరిదిద్దామని ఇస్రో చెబుతోంది.

ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వనిత



ఎం.వనిత చంద్రయాన్-2లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె డిజైన్ ఇంజనీర్ శిక్షణ తీసుకున్నారు. 'ఆస్ట్రనామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' నుంచి 2006లో బెస్ట్ వుమన్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. వనిత చాలా ఏళ్ల నుంచీ ఉపగ్రహాల కోసం పనిచేస్తున్నారు.దీనిపై మాట్లాడిన సైన్స్ నిపుణులు పల్లవ్ బాగ్లా "మిషన్ ఏదైనా దాని పూర్తి బాధ్యతలు ప్రాజెక్ట్ డైరెక్టర్‌పైనే ఉంటాయి. ఒక మిషన్‌కు ఒకే ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంటారు. అయితే కొన్ని మిషన్‌లలో ఆర్బిట్ డైరెక్టర్, శాటిలైట్ లేదా రాకెట్ డైరెక్టర్ అంటూ ఒకరికంటే ఎక్కువ మంది మిషన్ డైరెక్టర్లు ఉండవచ్చు. చంద్రయాన్-2 మిషన్ విజయవంతం అయ్యేలా వనిత ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని కోణాలూ చూసుకోవాల్సి ఉంటుంది. ఆమెకు పైన ఒక ప్రోగ్రాం డైరెక్టర్ ఉంటారు.

సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షకు కమిటీ ఏర్పాటు

కమిటీ కన్వీనర్ గా జలవనరుల శాఖ చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్

రాజధాని వార్తలు, అమరావతి : ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఏపీ సర్కార్ ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, ఏపీలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సమీక్షించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేసింది. సాగునీటి ప్రాజెక్టులు, సీఆర్డీఏ, రోడ్లు, భవనాల శాఖలో ప్రాజెక్టులపై సమీక్షకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జలవనరుల శాఖ చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ కన్వీనర్ గా ఎనిమిది మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటు జరిగింది. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభం కాని ప్రాజెక్టులు, 25 శాతం కంటే తక్కువ పూర్తయిన ప్రాజెక్టులపై కమిటీ సమీక్ష చేయనుంది. అవసరమైతే రీటెండరింగ్ ను సూచించాలని, నలభై ఐదు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీలో ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బీ, ప్రాజెక్టు డిజైన్స్ రంగాలకు చెందిన రిటైర్డ్ ఇంజనీర్లు సభ్యులుగా ఉన్నట్టు సమాచారం.

మెసేజ్ ఫార్వార్డ్ చేస్తే..రూ.లక్ష మాయం

సైబర్ నేరగాడి నయా మోసం

రాజధాని వార్తలు,హైదరాబాద్ : బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఆన్‌లైన్ లావాదేవీల నిర్వహణకు ఓ వైపు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటుంటే సైబర్ నేరగాళ్లు కూడా అందుకు అనుగుణంగా రూట్ మార్చి కొత్త పోకడల్లో మోసాలకు పాల్పడుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తి పంపిన ఓ మెసేజ్‌ని ఫార్వార్డ్ చేసినందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి తన ఖాతా నుంచి లక్ష రూపాయలు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే... నగరంలోని రామంతాపూర్‌కు చెందిన ఓ వ్యాపారి (48)కి ఈనెల 4న ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు కిషోర్ అని, తాను ఎయిర్‌టెల్ ప్రతినిధినని తనను తాను పరిచయం చేసుకున్నాడు. త్వరలోనే మీ సిమ్ బ్లాక్ అవుతుందని, అలాకాకుండా ఉండేందుకు మీ యూపీఐ ఖాతా నుంచి రూ.10 చెల్లించాలని కోరాడు. సదరు వ్యాపారి తనకు యూపీఐ ఖాతా లేదని చెప్పగా తాను ఓ మెసేజ్ పంపిస్తానని, దాన్ని తానిచ్చిన సెల్ ఫోన్ నంబర్‌కి ఫార్వర్డ్ చేస్తే చాలని నమ్మబలికాడు. అది నిజమేనేమో అనుకుని సదరు వ్యాపారి గుర్తు తెలియని వ్యక్తి పంపిన మెసేజ్‌ని ఫార్వార్డ్ చేశాడు. అంతే...కాసేపటికే అతని ఖాతా నుంచి 99,910 రూపాయలు వేరే అకౌంట్‌కు బదిలీ అయిపోయాయి. దీంతో కంగుతిన్న సదరు వ్యాపారి తాను మోసపోయానని గుర్తించి వెంటనే రాచకొండ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

తెలుగులో ఇద్దరికి సాహిత్యఅకాడమీ అవార్డులు

న్యూఢిల్లీ : యువ, బాల సాహిత్య పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించింది. ఇద్దరు తెలుగు సాహితీ వేత్తల రచనలకు ఈ ప్రతిషాత్మక పురస్కారాలు వరించాయి. యువ పురస్కారాల్లో తెలుగు నుంచి గడ్డం మోహన్‌రావు రచించిన 'కొంగవాలు కత్తి' నవల, బాలసాహిత్య విభాగంలో బెలగాం భీమేశ్వరరావు రచించిన 'తాత మాట వరాల మూట' కథకు ఈ ప్రఖ్యాత పురస్కారాలు వరించాయి. గడ్డం మోహన్‌రావు ప్రస్తుతం ఓయూలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. పరిశోధకుడిగా చిందు కళాకారుల జీవితాలను ఆయన వెలుగులోకి తీసుకొచ్చారు. చదివించే కథనం, సంఘటనలు, కళ్ల ముందు కదిలేలా అక్షరీకరించడం ఆయన శైలి ప్రత్యేకత. అలాగే, విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన బెలగాం భీమేశ్వరరావు 1979 నుంచి 40 ఏళ్లుగా బాలసాహిత్యానికి సేవలందిస్తున్నారు. 1000కి పైగా కథలు గేయాలు రచించారు. మహారాష్ట్రలో తెలుగు భాష అభ్యసించే విద్యార్థులకు ఈయన కథలు, నాటికలను పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు.

ఎందుకు ఓడామో తెలియట్లేదు

టీడీపీ విస్తృత స్థాయి భేటీలో వివక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యలు



రాజధాని వార్తలు, అమరావతి : ఈ ఎన్నికల్లో టీడీపీ ఓటమికి కారణాలు తెలియడం లేదని పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో టీడీపీ ఓడిపోయినా ప్రతిసారి ఏదో ఒక కారణం ఉండేదని, ఈసారి మాత్రం ప్రజలు ఎందుకు ఓడించారో కారణం అంతుబట్టడం లేదని చెప్పారు. విజయవాడలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 37 సంవత్సరాల పార్టీ చరిత్రలో ఐదు సార్లు గెలిచామని, నాలుగు సార్లు ఓడిపోయామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సమాజమని, పార్టీ శాశ్వతమని చెప్పారు. సీట్లు తగ్గినా ఓట్ల శాతం గణనీయంగా ఉందన్నారు. ఓటమికి కారణాలపై విశ్లేషించుకున్నామని, ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా ఓటమికి దారితీసిన అంశాలను పరిశీలించాలన్నారు. ఓటమికి కారణాలను లోతుగా విశ్లేషించేందుకు పార్లమెంట్ స్థానాల వారీగా త్రిసభ్య కమిటీలు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

నేడు డీజీపీ వద్దకు టీడీపీ నేతలు

రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని చంద్రబాబు ఆరోపించారు. 22 రోజుల్లో వైఎస్సార్‌సీపీ దాడుల్లో ఐదుగురు చనిపోయారని 73 మందిపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. దాడుల్లో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తామని తెలిపారు. దాడులపై డీజీపీని కలసి వినతి పత్రం సమర్పించాలని నిర్ణయించారు. మరోవైపు తాను బీజేపీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రజారంలో నిజం లేదని మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు.

మీవల్లే ఓడిపోయాం..!

ఈ ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయానికి అధినేత చంద్రబాబు వైఖరే కారణమని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలను గాలికి వదిలేసి అధికారులు చెప్పిన విషయాలనే నమ్మడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని ధ్వజమెత్తారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సమావేశంలో పలువురు నాయకులు చంద్రబాబు తీరును తప్పుబట్టారు. వేల మందిలో ఒకేసారి టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఏం సాధించారని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చంద్రబాబును నిదీసినంత పని చేశారు. ఎవరైనా నిజాలు చెబుతున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో మానవీయ కోణం లోపించిందని, కార్యకర్తలు ప్రజలకు దగ్గరవలేకపోగా, జన్మభూమి కమిటీలు ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల వ్యతిరేకత కొనితెచ్చుకున్నారని ఎమ్మెల్యే జూపూడి ప్రభాకర్ చెప్పారు. చంద్రబాబుకు కార్యకర్తలకు మధ్య దూరం పెరిగిపోయిందని, కిందిస్థాయిలో ఏం జరుగుతుందో తెలియకపోవడానికి ఇదే కారణమన్నారు. కార్యకర్తలను నాయకులు నిర్లక్ష్యం చేశారని, పార్టీకీ నష్టం చేసే అంశాలను గుర్తించలేకపోయారన్నారు. రియల్ టైం గవర్నెన్స్ నివేదికలను నమ్మడం వల్ల నిండా మునిగామని వ్యాఖ్యానించారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబసభ్యుల అరాచకాలపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత ఎన్నికల సమయంలో స్పష్టంగా కనిపించిందని పార్టీ అధికార ప్రతినిధి దివ్యవాణి తెలిపారు. పరస్పర విబేధాల వల్ల నష్టపోయినట్లు అనంతపురం జిల్లా నాయకులు చెప్పారు. న్యాయపరమైన ఇబ్బందులు, కేసేలే పెరిగిన దృష్ట్యా పార్టీ లీగల్ వింగ్‌ను పటిష్ట పరచాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సూచించారు.

గుంటూరు-దొనకొండ సెక్షన్‌లో పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు

- నిర్వహణ పనుల కారణంగా అధికారుల నిర్ణయం
- ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు వర్తింపు

రాజధాని వార్తలు, గుంటూరు : గుంటూరు-దొనకొండ సెక్షన్‌లోని రూట్లలో ఆర్‌సీసీ బ్లాకులు, రైలు పట్టాల మార్పిడి పనుల కారణంగా ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేయడం, కొన్ని రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం వాసుదేవరెడ్డి తెలిపారు. గుంటూరు - డోన్ ప్యాసింజర్(నంబర్ 57328)ను16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు, డోన్ - గుంటూరు ప్యాసింజర్(నంబర్ 57327) ను ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే రేపల్లె - మార్కాపురం రోడ్డు ప్యాసింజర్ (నంబర్ 77247) ఈనెల 17, 21 తేదీల్లో గుంటూరు వరకే నడుస్తుంది. మార్కాపురం రోడ్డు - తెనాలి ప్యాసింజర్(నంబర్ 77249) ఈనెల 17, 21తేదీల్లో గుంటూరు నుంచి నడుస్తుంది. హుబ్లీ - విజయవాడ ప్యాసింజర్ (నంబర్ 56502) ఈ నెల 17న 15 నిమిషాలు, 21వ తేదీన 45 నిమిషాల పాటు మార్గమధ్యంలో నిలిపివేస్తారు.

భగ భగ మండే ఎండల్లో ..

రోహిణీ కార్తె దాటి పోయినా భయంకరమైన ఎండలు మనల్ని వెంటాడుతూనే ఉన్నాయి. పొట్ట కూటి కోసం మిట్ట మధ్యాహ్న వేళ గుంటూరు రింగ్ రోడ్డు సెంటర్‌లో కనపడిన జామ కాయ విక్రేత. - కిరణ్ కుమార్.గుంటూరు.

రాజధాని క్లాసిఫైడ్స్

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి 9440662699

షాప్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

ఇల్లు అమ్మ కం
గుంటూరు నగరంలోని బొంగరాల బీడు ఏరియా లోని స్వాతి పేట, హౌస్ నెంబర్ : 7-6-132, గుంటూరులో.....140 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు రేకుల ఇల్లు అమ్మ కానికి కలవు. సంప్రదించండి ...99856 58208

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

తుళ్ళూరు
ఎస్‌యం (స్టైల్ ఫర్ మెన్)
ఫోన్ : 9440307123

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

హోటల్స్

విజయవాడ
నోవోటెల్
ఫోన్ : 0866 6688999

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

మంగళగిరి
సాగర్ బోర్ వెల్స్ బుద్ధారోడ్... యుకో బ్యాంకు ప్రక్కన
మల్లవరపు రమేష్ బాబు
ఫోన్ : 7981075683

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ఫ్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

హస్పటల్స్

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రాసుంది. -9440662699

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

యూనివర్సిటీ

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు. - మేనేజర్

బెంగాల్‌లో నిలిచిన వైద్య సేవలు..

700 మంది వైద్యుల రాజీనామా!

రాజధాని వార్తలు, బెంగాల్ : తమకు రక్షణ కల్పించాల్సిందిగా కోరుతూ కోల్‌కతా వైద్యులు చేపట్టిన ఆందోళన ఐదో రోజుకు చేరుకుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. మరోవైపు, వారికి మద్దతుగా పశ్చిమబెంగాల్‌లో 700 మంది వైద్యులు రాజీనామా చేశారు. దీంతో వైద్య సేవలు స్తంభించి పోయాయి. రోగుల వెతలు వర్ణనాతీతంగా మారాయి. వివిధ ఆసుపత్రులకు చెందిన 700 మంది ప్రభుత్వ వైద్యులు గంటల వ్యవధిలోనే రాజీనామా చేయడం కలకలం రేపింది.

వైద్యులు వెంటనే ఆందోళన విరమించి విధుల్లో చేరాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆదేశించిన గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. జూనియర్ వైద్యులకు మద్దతుగా ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి వైస్ ప్రిన్సిపాల్ గురువారం రాజీనామా చేశారు. అలాగే, బీటీ రోడ్డులోని సాగోర్ దత్తా మెడికల్ కాలేజీకి చెందిన 21 మంది సీనియర్ డాక్టర్లు తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

ఇక శుక్రవారం ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీకి చెందిన 107 మంది రాజీనామా చేయగా, ఆ తర్వాతి గంటలోనే మెడికల్ కాలేజీ అండ్ ఆసుపత్రికి చెందిన 100 మంది వైద్యులు రిజైన్ చేశారు. ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రి వైద్యులు 175 మంది, చిత్తరంజన్ నేషనల్ మెడికల్ కాలేజీకి చెందిన 16 మంది, ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు 100 మంది, స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసన్‌కు చెందిన 33 మంది వరుసగా రాజీనామాలు చేశారు. గంటల వ్యవధిలోనే వందలాదిమంది రాజీనామా చేయడంతో వైద్య సేవలకు పెద్ద ఎత్తున ఆటంకం కలిగింది. అత్యవసర వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్న రోగులు అల్లాడిపోతున్నారు.

ఇలాగైతే ప్రభుత్వ పాఠశాలలు మూతే..

ఢిల్లీలో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఏర్పాటుచేసిన గవర్నమెంట్ స్కూళ్లు

మెరుగైన సమాజానికి విద్యా,వైద్యం ప్రాథమిక అవసరాలుగా గుర్తించాలి.విద్యారంగానికి పునాది, మూలస్తంభం పాఠశాల విద్య. విద్యారంగం ప్రక్షాళన చెంది ప్రభుత్వ పాఠశాలలు కొత్త భవనాలతో అన్ని ఆధునిక హంగులతో అర్హులైన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో కళకళలాడుతాయని, కార్పొరేటు స్కూళ్లను రద్దుచేసి లేదా ప్రభుత్వపరం చేసి, ప్రభుత్వ స్కూళ్లను పరిపుష్టం చేస్తారని నవ్యాంధ్ర ప్రజలు కలలు కన్నారు. అయితే నూతన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రైవేటు పాఠశాలలకు కూడా అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు అందిస్తానడం విద్యావేత్తలు, విద్యార్థి, ఉపాధ్యాయనేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇలాగైతే ప్రభుత్వ పాఠశాలలు మూతపడతాయని హెచ్చరిస్తున్నారు.గత ఐదేళ్లలో కార్పొరేటు స్కూళ్ల సంఖ్య పెరిగిందే తప్ప తరగలేదు. విద్య ప్రైవేటీకరణ మానవ నాగరికత పరిణామానికి ప్రమాదం అని మనందరం గ్రహించాలి.

విద్యను ప్రభుత్వరంగం నుంచి తప్పించి ప్రైవేట్‌పరం చేయడం ప్రపంచీకరణలో భాగం. **దేశ వ్యాప్తంగా ఈ ధోరణి ప్రబలిపోయిన నేపథ్యంలో అమ్మఒడి కార్యక్రమం ద్వారా ఏడాదికి ప్రభుత్వ పాఠశాలకు పంపే తల్లిదండ్రులకు రూ.15 వేలు ఇస్తామని దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేవ్ ముఖ్యమంత్రి ప్రకటించడం ముదావహం.** అయితే ప్రైవేటు స్కూళ్లల్లో చదివే తల్లిదండ్రులకు కూడా ఇదే అమలు చేయాలనుకోవడాన్ని విద్యావేత్తలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు తప్పుపడుతున్నారు. ఇప్పటికే అరకొర సౌకర్యాలతో తామర తంపరగా పుట్టుకొచ్చిన ఇంజనీరింగ్, ఫార్మసి, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలతో అమలు చేసే రీయింబర్స్‌మెంటుతో ఏటా వేలాది కోట్ల రూపాయల ప్రజా ధనం నష్టపోతున్నాం. వాస్తవానికి ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేసి నాణ్యత గల విద్య అందిస్తే అది ప్రభుత్వానికి, ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. దీనిపై సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి జగన్ ప్రైవేటు పాఠశాలలకు కూడా అమలు చేయాలనుకోవడం సరికాదు. రెండేళ్లలో రాష్ట్రంలోని 40వేల ప్రభుత్వ పాఠశాలలను నూతనీకరిస్తానని వెలువరించిన ఆయన ప్రైవేటు పాఠశాలలకు కూడా నగదును ప్రకటించడం శోచనీయం. మాట ఇచ్చాను కాబట్టి అమలు చేస్తానని జగన్ ప్రకటిస్తే ప్రభుత్వపాఠశాలలన్నీ మూసివేతకు సిద్ధపడాల్సిందే.ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సగం ఆధార్ కార్డులు ప్రైవేటు పాఠశాలల్లో ఉంటున్నాయి. ఫీజు కట్టినప్పుడు అక్కడ, కట్టకుంటే ఇక్కడకు వస్తూ విద్యార్థులు గజిబిజికి లోనై చదువులో వెనుకబడుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వపాఠశాలలను ఉజ్జీవింపచేస్తే కొత్త పోస్టులు వస్తాయని ఎదురుచూసిన నిరుద్యోగ బీఈడీ అభ్యర్థులకు కూడా ఇది శరాఘాతమే..

మన దేశంలో 1980ల వరకు ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యను తర్వాత ప్రైవేటీకరించడం ప్రారంభమైంది. అంతర్జాతీయ పెట్టుబడిని ఈ రంగంలోకి ఆహ్వానించడం కూడా అప్పుడే ప్రారంభమైంది. దీంతో భారత రాజ్యాంగపు ఆదేశిక సూత్రాలను కూడా కాదని విద్యారంగంలో ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించారు. లాభాలు చేసుకోవడానికి విద్య సులువైన మార్గాన్ని తెరిచింది. ఇలా లక్షలు, కోట్లు ఫీజులు కట్టి చదువుకొన్న యువతీయువకులు వ్యాపారస్తుల్లా మారతారే తప్ప సామాజిక స్పృహ కలిగిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగరు. అవినీతి మూలాలు మనం తయారు చేసే విద్యాప్రక్రియలో కూడా ఉంటాయనే విషయాన్ని పాలకులు ఆలోచించలేదు. విద్య ప్రైవేటీకరణ మానవ నాగరికత పరిణామానికే ప్రమాదమని ఆర్థం చేసుకుంటే తప్ప విద్యా పోరాట ఉద్దేశం అర్థం కాదు.

> ఏడాది కోసం ప్రణాళిక వేసుకుంటే
> **వరిని నాటండి**
> పదేళ్ల కోసం ప్రణాళిక వేసుకుంటే
> **మొక్కలు నాటండి**
> జీవితకాలం కోసం ప్రణాళిక వేసుకుంటే
> **ప్రజలను విద్యావంతులు చేయండి**
> – చైనా సామెత

విద్యా పరిరక్షణ కమిటీ,అఖిల భారత విద్యా హక్కు పోరం కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని రాజీలేని పోరాటం చేస్తున్నది. ఆర్థికంగా, సామాజికంగా అంతరాలున్న సమాజంలో ఒక ఆవాస ప్రాంతంలోని పిల్లలందరూ ఒకే స్కూలుకు వెళ్లడం వలన పిల్లల మధ్య సరస్పర అవగాహనే కాక కొఠారి కమిషన్ చెప్పినట్లు సంపన్నుల పిల్లలకు పేదలపట్ల ఏర్పడే సానుభూతి అలాగే పేద పిల్లలకు సంపన్నుల పట్ల ఏర్పడే సానుకూల దృక్పథంవల్ల పేదరికం, సంపద సహజీవనం చేయడానికి పరోక్షంగా తోడ్పడుతుంది. దూరదృష్టి కోల్పోయిన పాలక వర్గానికి కొఠారి ప్రతిపాదనలోని అంతరార్థం పూర్తిగా అవగాహన కావడం లేదు. ఎటువంటి రాజకీయ చరిత్ర లేని కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం దేశరాజధానిలోని ప్రభుత్వ పాఠశాలలకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చింది. కనీస సౌకర్యాలు లేని, ఊడిపోయి పెంకులు, శిథిలమైన గోడల మధ్య ఉన్న పాఠశాలలను నూతనీకరించి, కార్పొరేట్ సూళ్లకు సవాల్ విసిరింది. ఆయా ప్రాంగణాలను విద్యార్థులకు అనుకూలంగా మార్చింది. ఏటా వర్షాకాలం డెంగీ, చికెన్‌గున్యాతో పేదలు ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. దీన్ని నివారించేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి క్లినిక్ (మొహల్లాలు)లను తెరచి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఆయా వ్యాధులు తగ్గు ముఖం పట్టాయి. అలాగే కేరళలోని వామపక్ష పార్టీ ఆధ్వర్యంలోని పాఠశాలలు, మన సరిహద్దున ఉన్న తమిళనాడు ప్రభుత్వం విద్యారంగానికి కల్పిస్తున్న పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అంతేకాని ప్రైవేటు పాఠశాలలకు అమ్మఒడిని అందిస్తామనడం భావ్యం కాదు.

ప్రపంచాన్ని మార్చాలనుకుంటే అత్యంత శక్తిమంతమైన ఆయుధం 'విద్య'

ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు చాలా వరకు తగిన అర్హతలు లేని వారే ఉంటున్నారు. వారికి మెథడాలజీ తెలియకపోవడంతో పిల్లల్లో చదువుపట్ల జిజ్ఞాస కలిగించలేక వారిని దండించి, లేదా అవమానపరచి వారిని తమ దారిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పిల్లలు బట్టి పట్టే యంత్రాలుగా మారిపోతున్నారు. ఇది రుచించని వారు శాశ్వతంగా విద్యకు దూరమవుతున్నారు. అలా కాకుండా అన్ని అర్హతలున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలను చైతన్య పరచి వారిని చదువు పట్ల ఉత్తమాభిరుచి గలవారిగా మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే పాఠశాలల్లోని ప్రాథమిక సదుపాయాలు లేమి, టీచర్లను, విద్యార్థులను కుంగదీస్తుంది. నూతన ప్రభుత్వం ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఏటా విద్యకు మంచి బడ్జెట్ కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు జవసత్వాలు కల్పించాలని విద్యావేత్తలు కోరుకుంటున్నారు.

ఇదే సమయంలో ఉద్యోగం వచ్చేవరకు ఒకలా, తర్వాత ఒకలా మారిపోయే ఉపాధ్యాయులను ఒక కంట కనిపెట్టాలి.నెలనెలా జీతాలు తీసుకుంటే విధులు నిర్వహించకుండా వడ్డీ వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ బిజినెస్‌లు చేస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకొని, వారిని జవాబుదారీగా చేయాలి. ఇవన్నీ నూతన ప్రభుత్వం పై ప్రజలు పెట్టుకున్న ఆశలు.. ఆకాంక్షలు..

– బోస్

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రాథమిక పాఠశాల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందిస్తున్నప్పుడు ఆయన వారికి ఎదురెళ్లి స్వాగతించేవారు. విద్యపై విద్యార్థులకు ప్రాథమికంగా అవగాహన కల్పించి వారిని మంచి విద్యార్థులుగా, సమాజాభివృద్ధికి అందించేది వారే అని కలాం నమ్మకం. అందుకే ఉన్నత, కళాశాల ఉత్తమ ఉపాధ్యాయుల కంటే వారికి అధిక గౌరవం ఇచ్చేవారు.

కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం దేశరాజధానిలోని ప్రభుత్వ పాఠశాలలకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చింది. కనీస సౌకర్యాలు లేని, ఊడిపోయి పెంకులు, శిథిలమైన గోడల మధ్య ఉన్న పాఠశాలలను నూతనీకరించి, ఉపాధ్యాయ నియామకాలు జరిపి కార్పొరేట్ సూళ్లకు సవాల్ విసిరింది.

మన దేశంలో 1980ల వరకు ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యను ప్రైవేటీకరించడం ప్రారంభమైంది. లాభాలు చేసుకోవడానికి విద్యారంగం సులువైన మార్గంగా మారింది. లక్షలు, కోట్లు ఫీజులు కట్టి చదువుకొన్న యువతీయువకులు వ్యాపారస్తుల్లా మారతారే తప్ప... సామాజిక స్పృహ కలిగిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగరు. అవినీతి మూలాలు మనం తయారు చేసే విద్యాప్రక్రియలో కూడా ఉంటాయనే విషయాన్ని ఈ నాటి పాలకులు ఆలోచించాలి.

'అ..ఆ' తెలియవు!

- అమరావతిలో 14 ఏళ్లలోపు పిల్లల్లో 47 శాతం మంది నిరక్షరాస్యులే
- సీఆర్‌డీఏ అధ్యయనంలో విస్మయం కలిగించే అంశాలు
- అధిక శాతం బాలకార్మికులేనని సామాజికవేత్తల అంచనా
- సామాజిక అభివృద్ధికి ప్రమాద సంకేతాలంటున్న అధికారులు

రాజధాని వార్తలు,అమరావతి : ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అక్షరాస్యతలో వేసకబడ్డ ఆంధ్రప్రదేశ్‌లో చదువురాని పిల్లల శాతం కూడా అధికంగా ఉన్నట్లు వెల్లడికావడం ఆందోళన కలిగిస్తోంది. రాజధాని అమరావతి (కృష్ణా-గుంటూరు రీజియన్)లో 14 ఏళ్లలోపు బాలబలికల్లో 47 శాతం మంది నిరక్షరాస్యులేనని 'సీఆర్‌డీఏ' అధ్యయనంలో గుర్తించారు. వీరుకనీసం 'అ.. ఆ'లు కూడా చదవలేకపోవటం గమనార్హం. వీరందరినీ బాలకార్మికులుగానే పరిగుణించాల్సి వస్తుందని, ఇది సామాజిక అభివృద్ధికి ఏమాత్రం దోహదపడదని అధికారులు. సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. సామాజిక అంశాలను మెరుగుపరచటంపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన పరిస్థితి ఆత్యవసరంగా కనిపిస్తోందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు చేప్పారు. హైటెక్ హంగులు. అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన రాజధానిలో ఆకాశ హార్మ్యాల నిర్మాణాల కన్నా విద్య. వైద్యం. పాష్టికాహారంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్షరాస్యత 67 శాతం మాత్రమే ఉంది. మిగతా 33 శాతం మంది నిరక్షరాస్యులే కావటం గమనార్హం.

వయసుల వారీగా అధ్యయనం

రాజధాని అమరావతిలో మయసుల వారీగా అక్షరాస్యులు. ఎంతవరకు చదువుకున్నారనే అంశాలను సీఆర్‌డీఏ అధ్యయనం చేసింది. ఇందులో విస్మయం కలిగించే వాస్తవాలు వెల్లడయ్యాయి. 14 ఏళ్లలోపు బాలబాలికల్లో 43 శాతం మంది ప్రాథమిక విద్య అంతకన్నా తక్కువగా చదివిన వారేనని వెల్లడైంది.15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసు మహిళల్లో 20 శాతం మంది నిక్షరాస్యులే కావడం గమనార్హం. పురుషుల్లో 12 శాతం మంది నిరక్షరాస్యులున్నారు. ఇదే వయస్సులో మహిళల్లో 28 శాతం మంది ప్రాథమిక విద్య అంతకన్నా తక్కువగా చదివిన వారు కాగా.. పురుషులు 20 శాతం మంది ఉన్నారు. ఇదే వయస్సు మహిళల్లో 42 శాతం మంది సెకండరీ విద్యను అభ్యసించగా, పురుషుల్లో 47 శాతం మంది సెకండరీ స్థాయి వరకు చదువుకున్నారు. ఇదే వయస్సు మహిళల్లో 10 శాతం మంది డిప్లమో ఆపైవిద్యను అభ్యసించగా పురుషుల్లో 16 శాతం మంది డిప్లమో ఆపై వరకు చదువుకున్నారు.

వయసు	విద్య	మహిళలు (శాతం)	పురుషులు (శాతం)
0-14ఏళ్లు	నిరక్షరాస్యులు	47	47
	ప్రాథమిక విద్య	43	43
	సెకండరీ	10	9
15-29 ఏళ్లు	నిరక్షరాస్యులు	20	12
	ప్రాథమిక విద్య	28	20
	సెకండరీ	42	47
	డిప్లమో ఆపైన	10	16
30-44 ఏళ్లు	నిరక్షరాస్యులు	42	28
	ప్రాథమిక విద్య	31	24
	సెకండరీ	19	26
	డిప్లమో ఆపైన	8	16
45-59ఏళ్లు	నిరక్షరాస్యులు	56	38
	ప్రాథమిక విద్య	29	25
	సెకండరీ	12	20
	డిప్లమో ఆపైన	4	12
60-74ఏళ్లు	నిరక్షరాస్యులు	69	47
	ప్రాథమిక విద్య	26	25
	సెకండరీ	4	17
	డిప్లమో ఆపైన	1	6

గుంటూరులో "భార్యా భర్తల బ్రేకప్!"

రాజధాని వార్తలు, డెస్క్ : 1997 నుండి గుంటూరు పట్టణంలోనే కాకుండా గుంటూరు జిల్లాలో అనేకచోట్ల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ఎన్నో వందలాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆరాధన ఆర్ట్స్ అకాడమి, గుంటూరు వారు ఇటీవల గుంటూరు పట్టణం బృందావన్ గార్డెన్స్ 5 వ లైన్‌లో ఉన్న శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికలో ఒక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. వాస్టిట్యూడ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో రాజధాని ప్రొడక్షన్స్ నిర్మించిన "భార్యా భర్తల బ్రేకప్!" లఘు చిత్రాన్ని ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. అమరావతి మండల ప్రజా పరిషత్ ఆఫీస్‌లో ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న దూపాటి తిరుమలేశ్వరరావు అధ్యక్షులుగా ఉన్న ఆరాధన ఆర్ట్స్ అకాడమి నిర్వహించిన ఈ కార్యక్రమం ఆశేషంగా హాజరయిన ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. కీర్తిశేషులు అడుసుమిల్లి నాగభూషణం, అడుసుమిల్లి భిక్షావతి గార్ల సంస్మరణలో వారి కుమారుడు, ఫోర్-సైట్స్ అవుట్‌డోర్ అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న అడుసుమిల్లి సురేంద్రప్రసాద్, గుంటూరులో ప్రముఖ ఆడిటర్, ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ & కన్సల్‌టెంట్స్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని సంయుక్తంగా సమర్పించారు. దర్శకులు గుమ్మడి ప్రేమ్‌చంద్ సభను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శి, పి.ఆర్.సికి కార్యదర్శిగా పని చేస్తున్న కె.వి.ఎస్.కె.ఎస్ పాపారావు. విశిష్ట అతిథులుగా అడుసుమిల్లి సురేంద్రప్రసాద్, రామరాజు శ్రీనివాసరావు, గౌరవ అతిథులుగా న్యాయశాఖలో ఓ.ఎస్.డీగా పనిచేస్తున్న కళావాచస్పతి, డాక్టర్ లంక లక్ష్మీనారాయణ, ప్రముఖ రచయిత దగ్గుమాటి పద్మాకర్, రాజధాని వార్తలు వారపత్రిక ఎడిటర్, పబ్లిషర్ మరియు లఘుచిత్రం నిర్మాత పి.హుస్సేన్ ఖాన్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, గుంటూరు పాలక మండలి అధ్యక్షులు మస్తానయ్య విచ్చేశారు. కార్యక్రమానికి ప్రారంభంగా రామరాజు శ్రీనివాసరావు, మస్తానయ్య, దూపాటి తిరుమలేశ్వరరావు, ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కావూరి సత్యనారాయణ, లఘుచిత్రం దర్శకులు గుమ్మడి ప్రేమ్‌చంద్ జ్యోతి ప్రజ్వలన కావించారు.

దర్శకుడు గుమ్మడి ప్రేమ్ చంద్ ను అతిథుల సమక్షంలో ఆలయం తరపున సత్కరిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామిదేవస్థానం నిర్వాహక కమిటీ అధ్యక్షులు మస్తానయ్య

ఈ కార్యక్రమంలో ముందుగా "నాట్యమయూరి", "నృత్య చంద్రిక", "నవరస భారత నాట్య మయూరి" బిరుదులతో పాటు మరెన్నో సత్కారాలు పొందిన ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారిణి కుమారి ప్రజ్ఞ ఆలపాటి - వినాయక కౌతం, బృందావన నిలయే అంశాలను తన నాట్య సోయగాలతో ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి, వారి కరతాళ ధ్వనులను అందుకొంది. నాట్య ప్రదర్శన అనంతరం హుస్సేన్ ఖాన్ నిర్మాతగా, గుమ్మడి ప్రేమ్‌చంద్ దర్శకత్వంలో వాస్టిట్యూడ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో రాజధాని ప్రొడక్షన్స్ నిర్మించిన సందేశాత్మక లఘు చిత్రం "భార్యా భర్తల బ్రేకప్!" ప్రదర్శించారు. చిత్రం చూసిన ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో తమ మెచ్చుకోలును తెలియజేశారు. కావూరి సత్యనారాయణ అధ్యక్షతన, దూపాటి తిరుమలేశ్వరరావు నిర్వహించిన ఈ సభాకార్యక్రమంలో గుమ్మడి ప్రేమ్‌చంద్, మస్తానయ్య, పాపారావు, లంక లక్ష్మీనారాయణ, రామరాజు శ్రీనివాసరావు, దగ్గుమాటి పద్మాకర్, హుస్సేన్ ఖాన్, అడుసుమిల్లి సురేంద్ర ప్రసాద్ వేదికపై ఆశీనులయ్యారు. ముందుగా లఘుచిత్రం నిర్మాత హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ తాను నిర్మించిన ఈ లఘుచిత్రం ప్రేక్షకుల మెప్పు పొందటం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. తర్వాత మాట్లాడిన మస్తానయ్య "లఘుచిత్రం అంటే ఎలా ఉంటుందో అనుకున్నాను, కానీ ఈ చిత్రం చాలా సందేశాత్మకంగా చక్కగా తీశారు" అని నిర్మాత, దర్శకులను అభినందించారు. ఈ లఘుచిత్రానికి కథను అందించిన ప్రసిద్ధ రచయిత దగ్గుమాటి పద్మాకర్ కూడా తమ అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమ సమర్పకులలో ఒకరైన డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బయట ఒక క్లినికల్ సైకాలజిస్ట్ ఒక జంటకు మాత్రమే ఒకసారి కౌన్సిలింగ్ ఇస్తారనీ, కానీ ఈ చిత్రం చూస్తే ఒకేసారి కొన్ని వేలమంది జంటలకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఉందని, చాలా మంచి సందేశాత్మక చిత్రాన్ని తీసిన నిర్మాత దర్శకుల్ని అభినందించారాయన. ఆయన ఇంకా మాట్లాడుతూ "దర్శకుడు ప్రేమ్‌చంద్ నన్ను కలిసినప్పుడు పట్టణ ప్రాంతాల్లో, నగర ప్రాంతాల్లో రోడ్ టెర్రర్‌కి బలయిపోతున్న యువకుల కథతో నా దగ్గరకు వస్తే, ఆ లఘు చిత్రాన్ని తీసేవారు నాకు తెలిసిన వాళ్ళున్నారు, వాళ్ళతో ఆ సినిమాను నేను తీయిస్తాను అని చెప్పాను" అన్నారు. తర్వాత మరో సమర్పకులు అడుసుమిల్లి సురేంద్ర మాట్లాడుతూ "దర్శకుడు ప్రేమ్‌చంద్ నాకు పాతికేళ్ళ పైనుండీ స్నేహితుడు. ఒక వ్యక్తిగా ఆయనను నేను ఎక్కువ గౌరవిస్తాను. అందుకే ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేయడానికి వెంటనే ఒప్పుకున్నాను. ఈ లఘు చిత్రాన్ని ప్రేమ్‌చంద్ చాలా చక్కగా తీశారు" అన్నారు. డా.లంక లక్ష్మీనారాయణ లఘుచిత్ర దర్శకనిర్మాతలను అభినందించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "దర్శకుడు ప్రేమ్‌చంద్ షూటింగ్ సమయంలో డైలాగ్స్ విషయంలో చాలా ఖచ్చితత్వాన్ని పాటిస్తారు. అందుకే ఆయన తీసిన సినిమాలు అంత బాగుంటాయి" అన్నారు. ముఖ్య అతిథి పాపారావు మాట్లాడుతూ "నాకు తెలిసిన వాళ్ళు తమ ఇంట్లో ఉన్న నూతన దంపతుల మధ్య పొరపొచ్చాలు వచ్చాయనీ మీరు వచ్చి మాట్లాడండి అని చెప్తే ఈ మధ్య వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళకు కౌన్సిలింగ్ చేసి వచ్చాను. ఇక్కడకు వచ్చి ఈ లఘుచిత్రం చూస్తే ఇది కూడా సేమ్ సబ్జెక్ట్ కావడం ఆశ్చర్యం కలిగించింది. దర్శకనిర్మాతలు ఇలాంటి ఇంకెన్నో మంచి చిత్రాలు తీయాలని నా ఆకాంక్ష. వారిద్దరికీ నా అభినందనలు" అన్నారు. దర్శకుడు గుమ్మడి ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ "అసలు ఈ సినిమాలో డాక్టర్ పాత్రను డాక్టర్ లంక లక్ష్మీనారాయణ గారిని వేయమని అడగడం జరిగింది. వారు ఒప్పుకున్నారు కూడా. తర్వాత పనుల ఒత్తిడి వలన, ఆయన డేట్స్ దొరక్కపోవడం వలన మా తమ్ముడు గుమ్మడి నాగేశ్వరరావును డాక్టర్ పాత్రకు తీసుకున్నాను. నాగేశ్వరరావు మంచి స్టేజీ నటుడు.ఈ లఘు చిత్రంలో తొలిసారిగా అవకాశం ఇచ్చాను. నా నమ్మకాన్ని నిలబెట్టాడు. తన ఎడమ పాదానికి గాయం అయినా దాన్ని లెక్క చేయకుండా ఈ రోజు నృత్యప్రదర్శన అద్భుతంగా చేసిన ప్రజ్ఞను తమ ఫీచర్ ఫిలిమ్స్‌లో నటించమని దర్శక నిర్మాతలు అడుగుతున్నారు. సంప్రదింపులు కూడా జరుగుతున్నాయి. ప్రజ్ఞకు మంచి భవిష్యత్తు ఉంది. నాట్యకళాకారిణిగా, నటిగా ప్రజ్ఞ ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నాను. ఆమెను తన చిన్నతనం నుండీ ఎంతో ప్రోత్సహిస్తున్న ప్రజ్ఞ తల్లిదండ్రులు జ్యోతి, ఆలపాటి రాంబాబు గార్లకు అభినందనలు. ఈ లఘుచిత్రం తీయడానికి నాకు అవకాశం ఇచ్చిన హుస్సేన్ ఖాన్ గారికి కృతజ్ఞతలు" అన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్పించిన అడుసుమిల్లి సురేంద్ర ప్రసాద్, డా.రామరాజు శ్రీనివాసరావు అతిథులందరికీ, ఈ చిత్రంలో నటించిన గుమ్మడి నాగేశ్వరరావు, ప్రజ్ఞ ఆలపాటి, మేకప్ అక్కినేని నాగేశ్వరరావు, ఈ చిత్ర సహకార దర్శకుడు దూపాటి తిరుమలేశ్వరరావు, నిర్మాత హుస్సేన్ ఖాన్, దర్శకులు గుమ్మడి ప్రేమ్‌చంద్‌లకు శాలువాలతో సత్కారం చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయకమిటీ అధ్యక్షులు మస్తానయ్య ఈ లఘుచిత్రం దర్శకులు గుమ్మడి ప్రేమ్‌చంద్‌ను దేవస్థానం తరపున దుశ్శాలువతో ప్రత్యేకంగా సత్కరించి, అతిథులందరికీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. సభ అధ్యక్షులు కావూరి సత్యనారాయణ ఈ చిత్ర దర్శక నిర్మాతలను ప్రశంశలతో ముంచెత్తారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు దూపాటి తిరుమలేశ్వరరావు వందన సమర్పణతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.

– వసంత యామిని

నిర్మాత పి. హుస్సేన్ ఖాన్ ను కార్యక్రమ సమర్పకులు అడుసుమిల్లి సురేంద్ర ప్రసాద్, డాక్టర్ రామరాజు శ్రీనివాస రావు అతిథుల సమక్షంలో సత్కరిస్తున్న దృశ్యం

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com